క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడిగా భానుప్రసాద్‌


ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు చిలకా భానుప్రసాద్‌

కుక్కునూరు: వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడిగా దామరచర్ల గ్రామానికి చెందిన చిలకా భాను ప్రసాద్‌ నియమితులయ్యారు. భానుప్రసాద్‌ను బుధవారం కుక్కునూరులో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నియమించారని తెలిపారు. తనను నియమించడం పట్ల బాలరాజుకు, మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్‌కు కృతజ్ఞతలు భానుప్రసాద్‌ తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం హైస్కూల్‌ వద్ద ఉన్న వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం సుమారు రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దాత చలంచర్ల సత్యనారాయణ, సహదాతలతో స్వామి వారికి అన్నప్రసాదాన్ని నైవద్యం సమర్పించామని కమిటీ సభ్యులు తెలిపారు.

గోసంరక్షణ శాలకు తవుడు అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ శాలకు భీమవరానికి చెందిన రుద్రరాజు సతీష్‌ రాజు బుధవారం రూ.1.15 లక్షలు విలువైన 3 టన్నుల తవుడు (దాణా)ను విరాళంగా అందజేశారు. వ్యానులో తీసుకొచ్చిన తౌడును ఆలయ అధికారులకు అందించగా, దాతను వారు ప్రత్యేకంగా అభినందించారు. దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు


చెక్కు అందిస్తున్న మాజీ సర్పంచ్‌ నరసింహరాజు

కొయ్యలగూడెం: స్థానిక పోతవరం రోడ్డులోని స్వయంభు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసినట్టు కోశాధికారి ఐలూరి విశ్వనాథ శర్మ బుధవారం తెలిపారు. గవరవరం మాజీ సర్పంచ్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ రూ.51,116, కొయ్యలగూడానికి చెందిన మాదేపల్లి సుబ్బరాజు రూ.27,000, మద్దిపట్ల మంగతాయారు రూ.10,116, వెలవలపల్లి అన్నపూర్ణ (తాడేపల్లిగూడెం) రూ.10,116, పెద్దిపట్ల సుధామాధురి (కాకినాడ) రూ.10,116, ముదునూరి పాండురంగ శ్రీరామ చంద్ర మూర్తిరాజు (భీమవరం) రూ.5,116 విరాళంగా అందజేశారని పేర్కొన్నారు. మంచాల వెంకయ్య నాయుడు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మేకల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి కుర్చీలు బహూకరణ


కుర్చీలను అందిస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల: స్థానిక పంచాయతీ కార్యాలయానికి ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర రజక సంఘం వారు బుధవారం 10 కుర్చీలను బహూకరించారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం వీటిని సంఘ అధ్యక్షుడు తొంటపాక భగవన్నారాయణ, ఉపాధ్యక్షుడు యండమూరి శ్రీనుబాబు తదితరులు గ్రామ సర్పంచ్‌ కుంటం స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి జీటీవీ శ్రీనివాస్‌లకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి గరిసేపల్లి రాజేష్‌, సభ్యులు తొంటపాక వెంకటేశ్వరరావు, భీమవరపు అంజిబాబు, యండమూరి సత్యనారాయణ, బసవరాజు నాగరాజు, పెనుమూడి తులసి, రేవూరి వీరాస్వామి, గరిసేపల్లి అవినాష్‌, యండమూరి విజయ్‌ తదితరులున్నారు.

కార్పెట్‌ రంగానికి పూర్వవైభవం

ఏలూరు(మెట్రో): స్థానిక గోదావరి సమావేశ మందిరంలో బుధవారం బీఐఎస్‌ నాణ్యతా ప్రమాణాలపై నిర్వహించిన వర్క్‌ షాప్‌లో భాగంగా ఏలూరు కార్పెట్‌, వివిధ బ్యాంక్‌ స్టాల్స్‌ ఏర్పాటుచేశారు. ఈ స్టాల్స్‌ను కలెక్టర్‌ కె.వెట్రిసెల్వి సందర్శించారు. ఏలూరు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన కార్పెట్‌ రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తుందని ఆమె తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ఎంఎస్‌ఎంఈ, ఫుడ్‌ ప్రోసెసింగ్‌ యూనిట్లు, ఏర్పాటుకు బ్యాంకర్లు ఇస్తున్న రుణాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌డీఎం డి.నీలాద్రి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.సుబ్రహమణ్యేశ్వరరావు, ఉప కార్మిక కమిషనర్‌ పి.శ్రీనివాసరావు, ఎఫ్‌ఎస్‌ఎంఈ కన్వీనర్‌ ఎం వేణుగోపాల్‌ తదితరులు ఉన్నారు.

అబద్ధాల్లో బాబును మించిన వారు లేరు

- నేడు రాష్ట్రంపై అప్పుల భారం
- మాజీ ఎమ్మెల్యే బాలరాజు ధ్వజం


హామీల క్యూఆర్‌ కోడ్‌ను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కుక్కునూరు: అబద్ధపు మాటలు చెప్పడంలో చంద్రబాబుకు మించిన బ్రాండ్‌ అంబాసిడర్‌ మరొకరుండరని వైఎస్సార్‌సీపీ పోలవరం మాజీ ఎం ఎల్‌ ఏ తెల్లం బాలరాజు అన్నారు. బుధవారం కుక్కునూరు చర్చి హాస్టల్‌ ఆవరణలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ రీకాలింగ్‌ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్‌ అధ్యక్షతన నిర్వహించారు. చంద్రబాబు అధికారం దాహంతో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, బాండ్లు ప్రజలకు తెలిసేలా రూపొందించిన క్యూఆర్‌ కోడ్‌ను బాలరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌చేసి చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలు, కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాదిలో ఏమేరకు హామీలు అమలు చేసింది చూడొచ్చని వివరించారు. అధికారం చేపడితే సంపద సృష్టిస్తామని ప్రగల్బాలు పలికిన కూటమి నేతలు నేడు హామీలు అమలు చేయలేక రాష్ట్రాన్ని అమ్మలంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నిజంగా సంపద సృష్టించారని, అది సొంత పార్టీ నేతలకు, తన కొడుకు లోకేష్‌కు, దత్తపుత్రుడికి తప్ప రాష్టానికి, ప్రజలకు కాదని విమర్శించారు. సూపర్‌సిక్స్‌ అమలు చేయమని అడిగే వారిపై కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెడ్‌బుక్‌ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రాన్ని మరో అష్ట నిస్తాన్‌ చేశారని వివరించారు.

రూ.2 లక్షల కోట్ల భారం

ప్రజలకు ఇచ్చిన హామీలు క్రమ తప్పక వైఎస్స జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తే రాష్ట్రం మరో శ్రీలంకగా మారుస్తున్నారని విమర్శించిన కూటమి నేతలు ఏడాది పాలనలో హామీలు అమలు చేయకుండా రాష్ట్రంపై రూ.2 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపారని విమర్శించారు. మహిళల మాన, ప్రాణాలకు రక్షణ కరువైందని వాపోయారు. గడిచిన ఏడాది కాలంలో దాదాపు వెయ్యి మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాల జరుగుతున్నా పవన్‌ కళ్యాణ్‌ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. జగన్‌ హాయంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు మిసయ్యారని పూనకంతో ఊగిపోయిన పవన్‌ కళ్యాణ్‌ ఇప్పుడా పూనకాలు ఏమైయ్యాయని నిలదీశారు. రాబోవు రోజుల్లో వైఎస్సార్‌ సీపీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధికారం చేపట్టాక కూటమి అధికారంలో ఉండగా ఎవరైతే వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలను, నాయకులను ఇబ్బంది పెట్టారో వారందరికీ రిటర్న్‌గిఫ్ట్‌ ఉంటుందని కార్యకర్తలు అధైర్యపడొద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, సర్పంచ్‌ రావు మీనావినోద్‌, నాయకులు మాదిరాజు వెంకన్నబాబు, రాయి సత్యనారాయణ, గాడిద రామచంద్రం, మల్లెల చంటినాయుడు, పగిళ్ల అల్లేష్‌, కొమ్ము వీరబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న గోపాల యాదవ్‌

కామవరపుకోట: వైఎస్సార్‌ సీపీ బలోపేతానికి కలిసి పని చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్‌ యాదవ్‌ అన్నారు. బుధవారం కంటమనేని వారి గూడెంలో తన నివాసంలో కన్వీనర్‌ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గోపాల యాదవ్‌ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు. సమావేశంలో మోరంపూడి సత్యనారాయణ, మందలపు కృష్ణారావు, సొసైటీ మాజీ అధ్యక్షులు గుర్రాల రవికుమార్‌, టౌన్‌ ప్రెసిడెంట్‌ నానాది సాగర్‌, గోరుముచ్చు శ్రీను, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం నాయుడు, కొమ్మిన నరేష్‌, రామన్నపాలెం ఉప సర్పంచ్‌ నార్ని సతీష్‌, నార్ని శ్రీను, సర్వేశ్వరరావు, మహేష్‌ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో జ్యోతి శ్రీనివాస్‌, తానేటి వనిత


పార్టీ అధినేతతో వెంకన్నబాబు


పార్టీ అధినేతతో రాంబాబు


పార్టీ అధినేతతో సాయికృష్ణ


పార్టీ అధినేతతో రమేష్‌రెడ్డి

ద్వారకాతిరుమల: వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాజీ హోం మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత ఆధ్వర్యంలో పలువురు మండల నాయకులు బుధవారం కలిశారు. వీరిలో పార్టీ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబు, బూత్‌ కమిటీల అధ్యక్షుడు గుర్రాల లక్ష్మణ్‌, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు దాసరి రాంబాబు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్‌, సచివాలయాల కన్వీనర్‌ భోగరాజు సాయికృష్ణ, రాజ్‌కుమార్‌, దాకారపు అగ్గియ్య ఉన్నారు. నాగమణి జగనన్నకు రాఖీ కట్టారు. సాయికృష్ణ ద్వారకాతిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అధినేతకు అందజేశారు.

జగన్‌ను కలిసిన చింతలపూడి నేతలు

చింతలపూడి : తాడేపల్లి క్యాంప్‌ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం వైఎస్సార్‌ సీపీ చింతలపూడి మండల అధ్యక్షుడు ఎస్‌ రమేష్‌రెడ్డి వ్రుర్యాదపూర్వకంగా కలిశారు. తనకు మండల అధ్యక్ష పదవికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కనమతరెడ్డి చండీ ప్రియరెడ్డి, కామవరపుకోట మండల వైస్‌ ఎంపీపీ గిరిజ అధినేత జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


రాఖీ కడుతున్న నాగమణి


పార్టీ అధినేతతో చండీ ప్రియరెడ్డి

మాజీ హోం మంత్రి వనిత పరామర్శలు


చిన్నాను పరామర్శిస్తున్న మాజీ హోం మంత్రి వనిత.

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో ఇద్దరు వైఎస్సార్‌ సీపీ నాయకులను మాజీ హోం మంత్రి, వైఎస్సార్‌ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత బుధవారం పరామర్శించారు. ముందుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ ప్రతాపనేని వాసు సోదరుడు ప్రసాద్‌ను స్థానిక అమ్మా అపార్ట్‌మెంట్‌లో పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన అంబటి చిన్నా ఇంటికి వెళ్లి, ఆయన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్‌, అచ్యుత ఏసుబాబు, పొనమాల ఉమామహేశ్వరరావు, బొండాడ సాత్యకిరావు, చిలుకూరి చంద్రం, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివ, ములకాల పెద్ద పానకాలు, రామాయణం నాగాచారి, దూలపల్లి ప్రసాద్‌, పొంగులేటి రమేష్‌, బొంతు శ్రీను, దాస్యం వర్మ, ములకాల పండు, నడికట్టి రామాంజనేయులు, గోపా నాగేశ్వరరావు, సాదనాల రాజా, దాసరి రాంబాబు, చిన్న చిన్ని, గుర్రాల లక్ష్మణ్‌ తదితరులున్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కుక్కునూరు: మండలంలోని లచ్చిగూడెం గ్రామస్తులకు నెమలిపేట ఆర్‌ అండ్‌ ఆర్‌ కాలనీలో ఏర్పాటు చేసిన గోదావరి వరద పునరావాస సహాయక కేంద్రంలో సరైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం సీపీఐ ఎంఎల్‌ ప్రజాపంథా నాయకులు కుక్కునూరు తహసీల్దార్‌ పి.రమేష్‌ బాబుకు వినతిపత్రం అందించారు. పునరావాస కేంద్రంలో ఇళ్లలకు బాత్‌రూమ్‌లకు డోర్లు లేవని, తాగునీరు లేదని, విద్యుత్‌ సదుపాయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌, వైద్య ఆరోగ్య శాఖ కమ్యూనిటీ సెంటర్‌ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌ అండ్‌ ఆర్‌ కాలనీలను పూర్తిచేసి నిర్వాసితులకు సీరియల్‌ నంబర్ల ప్రకారం ఇళ్లను కేటాయించాలని పేర్కొన్నారు. పోలవరం ఆర్‌ అండ్‌ ఆర్‌ ఇంటి నిర్మాణాలకు తక్కువ విలువలు వచ్చిన వారికి రీ సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకులు షేక్‌ గౌస్‌, జంగారెడ్డిగూడెం డివిజన్‌ సభ్యుడు మచ్చా ప్రశాంత్‌, మండల కమిటీ సభ్యులు పెంకె వీరబాబు, సున్నం రాణి, మచ్చా లక్ష్మయ్య, పొడియం లక్ష్మణ్‌రావు, సున్నం రాజు, మడివి ఓ శయ్య, మడకం శంకర్‌, సున్నం శివ, మడివి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధానికి కృషి


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు

చింతలపూడి : మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జూనియర్‌ సివిల్‌ జడ్జి సీహెచ్‌ మధుబాబు అన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక అర్పణ జూనియర్‌ కళాశాలలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మధుబాబు మాట్లాడారు. పిల్లలు చదువుకునే వయసులో ప్రేమ పెళ్లిళ్లకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువగా ప్రేమ పేరుతో మోసపోతున్నారని వివరించారు. ప్రతి మహిళ, బాలిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ టి.క్రాంతి కుమార్‌, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, అడ్వకేట్‌ దుర్గ భవాని, సోషల్‌ వర్కర్‌ అక్బర్‌ అలీ, జూనియర్‌ సివిల్‌ జడ్జ్‌ కోర్టు సూపరింటెంట్‌ పి గుర్వి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల, వర్షాకాలంలో సంభవించే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఏలూరు కొత్తపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ శశాంక్‌ విద్యార్థులకు సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక కొత్తపేట గాంధీ నగర్‌ మున్సిపల్‌ హై స్కూల్‌ విద్యార్థులకు జ్వరాలు, అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అసిస్టెంట్‌ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, మూతల్లేని నూతులు, పూల కుండీలు రుబ్బురోలు, ఫ్లవర్‌ వాజ్‌, ఎయిర్‌ కూలర్స్‌ ఎప్పటికప్పుడు శుభ్రపరచుకొని మూతలు పెట్టుకోవాలని సూచించారు. వేడి వేడి తాజా ఆహార పదార్థాలు భుజించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్‌ అసిస్టెంట్‌ మేకా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత, ఉపాధ్యాయులు, స్కూల్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి


సమావేశంలో అధ్యక్షత వహించిన వాసవీ రత్నం, ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిల్‌ సభ్యులు, అధికారుల సహకారంతో కృషి చేస్తామని వైస్‌ చైర్మన్‌ కంచర్ల వాసవీరత్నం అన్నారు. మున్సిపల్‌ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణం అభివృద్ధి పథంలో నడిపేందుకు కౌన్సిల్‌ కృషి చేస్తుందన్నారు. అజెండాలోని మొత్తం 56 అంశాలతోపాటు మరో 4 అంశాలకు అజెండా ప్రవేశపెట్టగా, కౌన్సిల్‌ ఆమోదించిందని తెలిపారు. సమావేశంలో సభ్యులు శానిటేషన్‌, డంపింగ్‌ యార్డు, రోడ్డు తదితర సమస్యలను ప్రస్తావించారు. రోడ్డు, డ్రెయిన్‌ మార్గాల అభివృద్ధికి కృషిచేయాలని కంచర్ల వాసవీరత్నం ఎమ్మెల్యేను కోరారు. వీటిపై ఎమ్మెల్యే సొంగా రోషన్‌ కుమార్‌ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఏలూరు – వీరిశెట్టివారిపాలెం, ఏలూరు – జంగారెడ్డిగూడెం, కామవరపుకోట – చింతలపూడి ప్రధాన మార్గాలకు ప్రతిపాదనలు పంపామని, రేచర్ల – చింతలపూడి రోడ్డు నిర్మాణంతో ఉందని తెలిపారు. ఆడమిల్లి బ్రిడ్జి విషయంలో కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్లగా, డైవర్షన్‌ రోడ్డుకు రూ.17 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. సమాంతరంగా బ్రిడ్జి నిర్మాణానికి, జీవిమాల్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణానికి కోట్లప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కౌన్సిల్‌ సభ్యులు, కమిషనర్‌ కేవీ రమణ, తహసిల్దార్‌ కె.స్లీవజోజి, టీపీఓ చంద్రశేఖర్‌, విద్యుత్‌ డీఈ యు.సుబ్బారావు, ఏఈ రాజేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతల హాజరుపై విమర్శలు

కౌన్సిలర్‌ సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొనడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కమిషనర్‌ కేవీ రమణను అడగ్గా సమావేశంలో చివరలో టీడీపీ నాయకులు వచ్చారని, ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ వారికి ఫోన్‌ చేసి వారితో మాట్లాడే పని ఉండటంతో పిలిపించారని తెలిపారు. సమావేశం చివరి దశలో మాత్రమే కౌన్సిల్‌ హాల్‌లోకి టీడీపీ నాయకులు వచ్చినట్టు చెప్పారు.

స్మార్ట్‌ మీటర్లను వ్యతిరేకించండి


వేలేరుపాడులో స్మార్ట్‌ మీటర్లు వద్దు అంటూ సంతకాలు సేకరిస్తున్న అఖిలపక్ష నాయకులు

టి.నరసాపురం: ఇంటికి, షాపులకు అదానీ స్మార్ట్‌ మీటర్లను బిగించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని వైఎస్సార్‌ సీపీ బొర్రంపాలెం నాయకులు పెండ్యాల అభిషేక్‌ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఇప్పటికే అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో నలిగిపోతుంటే, స్మార్ట్‌ మీటర్ల పేరుతో ప్రజలపై మరిన్ని భారాలు వేయడమేనని తెలిపారు. అధికారంలోకి వస్తే విద్యుత్‌ బిల్లులు ఒక్కపైసా పెంచబోమని చెప్పి మాట తప్పారని పేర్కొన్నారు. సెల్‌ ఫోన్‌ రీచార్జి చేయించుకున్నట్టు ముందుగానే విద్యుత్‌ బిల్లు రీచార్జి చేయించుకోవడం అన్యాయమని తెలిపారు. కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీలు పేరుతో, కస్టమర్‌ చార్జీలు, వడ్డీ చార్జీలు తదితర పేర్లతో అదనపు చార్జీలు వసూలు చేస్తుందని వివరించారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించి, వ్యతిరేకించాలని కోరారు.

వేలేరుపాడు: స్మార్ట్‌ మీటర్లను వ్యతిరేకించాలని అఖిలపక్ష నాయకులు ప్రజలను కోరారు. రాష్ట్ర వామపక్షాల పిలుపులో భాగంగా వేలేరుపాడు మండలంలో అఖిలపక్ష ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి స్మార్ట్‌ మీటర్లకు వ్యతిరేకంగా, పెంచిన విద్యుత్‌ చార్జీలు తగ్గించాలని డిమాండ్‌ చేస్తూ సంతకాలు సేకరించే కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సీపీఐ నుంచి పిట్ట ప్రసాద్‌, బంధం నాగేశ్వరావు, కంగాల గంగరాజు, తాటి దుర్గారావు, సీపీఎం నుంచి మడకం ఏసు, కారం వెంకటరావు, కొత్త వెంకటేశ్వరరావు, సీపీఐ ఎంఎల్‌ ప్రజాపందా నుంచి కట్ట ముత్యాలరావు, కతం వీరన్న, ఉకే రవికుమార్‌, ఉకే వెంకట్రావు, కంటిపల్లి నాగేంద్రం, కాంగ్రెస్‌ నుంచి ఎస్‌కే ఇబ్రహీం, ఏపూరి వెంకటస్వామి, మాచర్ల భీమయ్య, నాయకులు జానుబాబు, యర్ర మధు, సోడే కన్నారావు, పిట్టా భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

5న విద్యుత్‌ కార్యాలయాల వద్ద ఆందోళన


ఎర్రగుంటపల్లిలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

చింతలపూడి : స్మార్ట్‌ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న విద్యుత్‌ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని ప్రజా వేదిక నాయకులు డిమాండ్‌ చేశారు. బుధవారం ఎర్రగుంటపల్లి గ్రామంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్‌ రెడ్‌ స్టార్‌ ఆధ్వర్యంలో మూడో రోజు సంతకాల సేకరణ చేశారు. సీపీఐ, సీపీఐ ఎంఎల్‌ రెడ్‌స్టార్‌ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, డి.రంగనాథ్‌ మాట్లాడుతూ స్మార్ట్‌ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించిన నారా లోకేష్‌ ఇప్పుడు అదానికి భయపడి స్మార్ట్‌ మీటర్ల బిగింపు విధానాన్ని అవలంబిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు డి.సత్యనారాయణ, వాసు, తోర్లపాటి బాబు, వివిధ సంఘాల నాయకులు కంచర్ల గురవయ్య, దొంతా కృష్ణ, తాడిగడప మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల భద్రతకు ప్రత్యేక చర్యలు

దెందులూరు: బ్యాంకుల భద్రతకు ప్రత్యేక చర్యలు సమష్టిగా తీసుకోవాలని పెదవేగి సమై రాజశేఖర్‌ అన్నారు. బుధవారం సీఐ కార్యాలయంలో ఆయన దెందులూరు, పెదపాడు, పెదవేగి బ్యాంకు మేనేజర్లతో బ్యాంకుల భద్రత రక్షణ చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. పోలీస్‌ శాఖ బ్యాంకుల ప్రతినిధుల సహకారంతో ప్రజల ఆస్తుల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి బ్యాంకు ఏటీఎం సెంటర్‌ వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డ్‌ను నియమించాలన్నారు. హై రిజల్యూషన్‌ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రవేశద్వారం క్యాషియర్‌ కౌంటర్‌ ఏటీఎం గదుల్లో సీసీటీవీ ఫుటేజీ 30 రోజుల పాటు భద్రంగా ఉంచాలన్నారు. రాత్రి సమయంలో ఏటీఎం సెంటర్లను సరిగ్గా పర్యవేక్షించే విధంగా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్‌ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్‌ పనుల నిమిత్తం సబ్‌స్టేషన్‌ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని ఈఈ పీర్‌ అహ్మద్‌ఖాన్‌ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన స్వమిత్ర సర్వే శిక్షణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజుల స్వమిత్ర సర్వే శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్‌ఆర్‌ కృష్ణప్రసాద్‌ మాట్లాడుతూ పంచాయతీ రాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి నిర్వహించాల్సిన స్వమిత్ర సర్వేకు సంబంధించి కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, డిజిటల్‌, ఇంజినీరింగ్‌ అసిస్టెట్లకు శిక్షణ ఇచ్చామన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ వీఎస్‌వీవీ సుజాత, ముఖ్య అతిథి జిల్లా పంచాయతీ అధికారిణి కొడాలి అనురాధ సర్వే అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పార్వతీశ్వరరావు కృషి ఎనలేనిది

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం జీసీసీ కార్యాలయం వద్ద బుధవారం జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు పదవీ విరమణ సభ జీసీసీ మేనేజర్‌ చెరుకూరి రాజయోగి అధ్యక్షతన నిర్వహించారు. పార్వతీశ్వరరావు కేఆర్‌పురం పరిధిలోని జీసీసీ, కుక్కునూరు పరిధిలోని జీసీసీల్లో అమ్మకాలు, లావాదేవీల్లో అద్భుతమైన ఫలితాలు సాధించేలా కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఐటీడీఏ మేనేజర్‌ ప్రకాష్‌, కుక్కునూరు జీసీసీ మేనేజర్‌ బాబూరావు, సిబ్బంది కళ్యాణ్‌, మాజీ జీసీసీ డైరెక్టర్‌ పోతురాజు పాల్గొన్నారు.

పాఠశాలలో బాలుడిపై వ్యక్తి దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న బాలికను అదే పాఠశాలలో చదువుతున్న బాలుడు ఏడిపిస్తున్నాడని, విషయం తెలుసుకున్న బాలికకు వరుసకు సోదరుడు అయిన చిన్న బుధవారం పాఠశాలకు వెళ్లి బాలుడిపై దాడి చేశాడు. దీంతో ఉపాధ్యాయులు వెంటనే సదరు వ్యక్తిని అడ్డుకుని, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై షేక్‌ జబీర్‌ పాఠశాలకు వెళ్లి వివరాలు తెలుసుకుని, బాలుడిని కొట్టిన చిన్నను మందలించారు. అనంతరం హెచ్‌ఎం సోమశేఖర్‌ బాలుడు, బాలిక పెద్దలకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.